క్లుప్తంగా

ఎమ్మెల్యే బొల్లాకు సత్కారం



వినుకొండ(నూజెండ్ల): నియోజకవర్గంలో ఐదు మండలాలకు సాక్షర భారత్ మండల కోఆర్డినేటర్స్‌గా విధులు నిర్వహించిన వారిని రాష్ట్ర ప్రభుత్వం మండల రీసోర్స్ కోఆర్డినేటర్లుగా నియమించిన సందర్భంగా స్థానిక శాసన సభ్యులు బొల్లా బ్రహ్మనాయుడును మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల రీసోర్స్ కోఆర్డినేటర్స్ పచ్చిగోళ్ల ప్రభాకరరావు, కంచర్ల సుబ్బరామయ్య, గుండాల కోటేశ్వరరావు, బొల్లా సుబ్బారావు, మూడావత్ నాగేశ్వరరావు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు అందజేత

శావల్యాపురం: మండలంలోని కొత్తలూరు గ్రామపంచాయతీ శివారు గ్రామం తుమ్మలకుంట ఎంపీపీ స్కూల్లోని విద్యార్థులకు జగనన్న విద్యాకానుకలో భాగంగా రెండో విడత (సెమిస్టర్-2) పాఠ్యపుస్తకాలు అందజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిళ్ళ రాజారమేష్ శనివారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న విద్యాకానుక కిట్లు విద్యార్థులు సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల పేరెంట్ కమిటీ చైర్మన్ సిద్దెల మరియమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉర్దూ డీఐని నియమించాలి

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా పరిధిలోని ఉర్దూ పాఠశాలల పర్యవేక్షణలో నెలకొన్న సందిగ్ధతను తొలగించేలా జిల్లా ఉర్దూ డీఐ నియామకం చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ప్రతినిధులు శనివారం ఉమ్మడి గుంటూరు జిల్లా పాఠశాలల ప్రాంతీయ విద్యా సంచాలకులకు వినతి పత్రం సమర్పించారు. గత కొంతకాలంగా పల్నాడు జిల్లాలోని ఉర్దూ పాఠశాలలను ఉర్దూ డీఐ హోదాలో నజ్మా ఖాటూన్ పర్యవేక్షిస్తున్నారనీ, ఇది అధికారికంగా, లేదా అనధికారంగానో అర్థం కాని పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. ఎటువంటి అధికారిక ఉత్తర్వులు లేకుండా పాఠశాలలను తనిఖీలు చేయవచ్చా అని ప్రశ్నించారు. గతంలో ఇదే విషయమై డీఈఓకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పల్నాడు జిల్లాకు అర్హత గల ఉర్దూ డీఐ నియామకం చేపట్టాలని ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.ప్రేమ్‌కుమార్, జి.విజయసారధి కోరారు.

ఈపూరులో సీపీఐ నిరసన

ఈపూరు: మతోన్మాదం, కార్పొరేట్ వ్యవస్థ కవలలుగా దేశాన్ని దోచుకుంటున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సీపీఐ వినుకొండ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రమైన ఈపూరులో సీపీఐ శాఖ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. తొలుత సీపీఐ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఊట్ల రామారావు, చిలకాబత్తిన సత్యానందం, సూరే అప్పారావు, కె.పరమేష్, మల్లికార్జున, పిన్నెబోయిన వెంకటేశ్వర్లు, పారిశుధ్య కార్మికులు, మహిళలు, కార్యకర్తలు, సానుభూతిపరులు తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలల ముందుగానే..

యడ్లపాడు: ప్రభుత్వ విద్యను బలోపేతం చేసే దిశగా భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. ఈ క్రమంలో పాఠశాలలు పునఃప్రారంభమైన రోజే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జగనన్న విద్యాకానుక (జేవీకే) కిట్లను ప్రభుత్వం అందజేసింది. తాజాగా 1 నుంచి 9 తరగతుల విద్యార్థులకు అక్టోబర్ నుంచి ప్రారంభమయ్యే సెమిస్టర్-2కు సంబంధించిన పాఠ్య పుస్తకాలను దాదాపు మూడు నెలల ముందే పాఠశాలలకు చేర్చేందుకు చర్యలు తీసుకున్నారు.

యడ్లపాడు పీహెచ్‌సీ తనిఖీ

యడ్లపాడు: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం రీజినల్ విజిలెన్స్ అధికారుల బృందం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించింది. రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ ఆదేశాల మేరకు రీజినల్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారి కె ఈశ్వరరరావు పర్యవేక్షణలో ఉమ్మడి గుంటూరు జిల్లాల పరిధిలోని ఆరు ఆస్పత్రిల్లో మూడు బృందాలు ఈ తనిఖీల్లో పాల్గొన్నాయి. ఇందులో భాగంగా విజిలెన్స్ అధికారి కె సైదులు ఆధ్వర్యంలోని బృందం యడ్లపాడు, చిలకలూరిపేట అర్బన్ హెల్త్ సెంటర్లను సందర్శించింది.

సెమిస్టర్ పుస్తకాలు పంపిణీ



విద్యాశాఖ అందించిన సెకండ్‌సెమిస్టర్ పుస్తకాలు శనివారం విద్యార్థులకు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పంపిణీ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో ఆంజనేయులు పాల్గొని విద్యార్థులకు పుస్తకాలు అందించారు. మొత్తం 17 వేల పుస్తకాలు పంపిణీ చేశారు. 1-9 తరగతి వరకూ పంపిణీ చేశారు. 6,7 తరగతులకు మాథ్స్, సైన్స్, సోషల్ స్టడీస్‌కు సంబంధించి ఎన్‌సీఆర్‌టీ సిలబస్, 9వ తరగతి పూర్తిగా మారిన సిలబస్, ఈ ఏడాది హిందీ సబ్జెక్టుకు సంబంధించి నాన్‌టెయిల్ పుస్తకాలు పంపిణీ చేశారు.

–నాదెండ్ల

లారీ టైరు ఊడి .. కారును ఢీకొని..



జాతీయ రహదారిపై గణపవరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు బోల్తాపడి ఇరువురికి గాయాలైన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గుంటూరు నుంచి వస్తున్న కంటెయినర్ లారీ టైరు ఊడి వెనుక వస్తున్న కారుకు ఢీకొంది. దీంతో కారు పల్టీ కొట్టి డివైడర్ మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని గుద్దుకుంది. కారులోని ఇరువురు గాయాలపాలవగా, క్షతగాత్రులను చిలకలూరిపేట ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులు రాష్ట్ర డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా బంధువులుగా గుర్తించారు. ప్రమాదం కారణంగా డివైడర్ మధ్యలోని విద్యుత్ స్తంభం ఒరిగి ప్రమాదభరితంగా మారింది.

– నాదెండ్ల

ఫ్యామిలీ ఫిజీషియన్



వెల్లటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నాయుడుపాలెం గ్రామ సచివాలయంలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్య బృందం ఇంటింటికీ తిరిగి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకొని కొందరికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వైద్యులు పి.కృష్ణానాయక్ మాట్లాడుతూ గ్రామంలో 150 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

–బొల్లాపల్లి

భోజన బల్లల వితరణ



ఇస్సప్పాలెంలో వేంచేసియున్న శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానం అన్నప్రసాద వితరణకు చిలకలూరిపేటకు చెందిన సంకటి సుబ్బారెడ్డి రూ.60వేలు విలువైన స్టీలు టేబుల్స్‌ను విరాళంగా అందజేసారు. ఆలయంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి వినియోగించేందుకు స్టీలు టేబుల్స్ అయ్యే ఖర్చును రూ.60వేలును శనివారం ఆలయ కార్యాలయంలో ఈఓ టి.సుధాకరరెడ్డికి అందించారు.

–నరసరావుపేట రూరల్

మరోదఫా వైఎస్సార్ సీపీని ప్రజలు దీవిస్తారు

- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- నాదెండ్లలో గడప గడపకు కార్యక్రమం

నాదెండ్ల: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పాలనపై ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలే తిప్పికొట్టి మరోదఫా వైఎస్సార్‌సీపీని దీవించేందుకు సిద్ధంగా ఉన్నారని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం రెండోరోజు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు అమలౌతున్న తీరును ప్రజలతో ముచ్చటిస్తూ ముందుకు సాగారు. తిమ్మాపురం రోడ్డులోని అంబేద్కర్ కాలనీ, 9,10, 11,12 వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పాలనను ప్రజల ముంగింట్లోకి తెచ్చారన్నారు. వలంటీర్ల వ్యవస్థ ద్వారా అన్ని పథకాలను ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ప్రజలకు అందిస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు పెద్ద ఎత్తున ఉద్యోగాల కల్పన చేశారన్నారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్లతో అన్ని పదవుల్లో మహిళా సాధికారత సాధించేలా అడుగులు వేయించారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలకు నామినేటెడ్ పదవుల్లో, ఇతర ప్రభుత్వ పదవుల్లో పెద్ద ఎత్తున అవకాశాలు కల్పించారన్నారు. వైఎస్సార్ రైతు భరోసా,



సంక్షేమ పథకాలు వివరిస్తున్న మంత్రి విడదల రజిని

అమ్మఒడి, ఆరోగ్యశ్రీ, విద్యాదీవెన, విద్యా వసతి, వైఎస్సార్ ఆసరా, చేయూత, వాహన మిత్ర, లానేస్తం వంటి ఎన్నో సంక్షేమ పథకాలు అమలుతో అన్ని వర్గాల్లో సంతోషాలు అందించారన్నారు. విద్య, వైద్య రంగాల్లో రాష్ట్రంలోనే స్వర్ణయుగం ఆవిష్కృతమైందన్నారు. ఇప్పటికే పలు రాష్ట్ర ప్రభుత్వాలు మన రాష్ట్రంలో అమలౌతున్న సంక్షేమ పథకాలను గమనిస్తూ, వారి రాష్ట్రాల్లో అమలు చేస్తున్నాయన్నారు.

సీసీ రోడ్లు ప్రారంభం...

అంబేద్కర్ కాలనీలో రూ.32.30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రెయిన్లను ఆమె ప్రారంభించారు. రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య లాడ్స్ నిధులు రూ.21.30 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.4 లక్షలు, పంచాయతీ రాజ్ రూ.7 లక్షలు నిధులతో నిర్మించిన రోడ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ మస్తాన్‌రావు, మార్కెట్ యార్డు చైర్మన్ రాజేంద్ర ప్రసాద్, గణపవరం, నాదెండ్ల సొసైటీ చైర్మన్లు మంగు ఏడుకొండలు, కురుకుంట్ల వెంకటరెడ్డి, ఎంపీటీసీలు యల్లారావు, కుంభా అంకమ్మ, దావల ఏసమ్మ, ఏలియ్య, కె.రామకృష్ణయ్య, దార్ల పరమేశ్వరరావు, కొరివి లక్ష్మయ్య, కాండ్రు శేషయ్య, చెంచురాజు, ఆలా శివగోపీ, కోనేటి నాగయ్య, జగనన్న సురక్ష మండల కన్వీనర్ అల్లడి రవికుమార్, గుంజి శ్రీనివాసరావు, మద్దూరి కోటిరెడ్డి, విక్రమ్‌రాజు, సింగారెడ్డి కోటిరెడ్డి, కోయలమూడి సాంబశివరావు, పఠాన్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులకు అసత్యాలే ఆయుధాలు

- దమ్ముంటే టీడీపీ కార్యాలయంలో ఘర్షణపై నిజనిర్ధారణ కమిటీ వేయండి
- విలేకర్ల సమావేశంలో సవాల్ విసిరిన ఎమ్మెల్యే గోపిరెడ్డి



నరసరావుపేట: రాష్ట్రంలో తెలుగుదేశం నాయకులు అసత్యాలనే ఆయుధాలుగా చేసుకుని రాజకీయం చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ముఖ్యమైన నాయకులను లక్ష్యాలుగా చేసుకొని జరగనివి జరిగినట్లుగా ప్రచారం చేస్తూ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. శనివారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడారు. ఇటీవల కోటప్పకొండరోడ్డులో జరిగిన దుర్ఘటనపై నిజనిర్ధారణ కమిటీ పేరుతో నరసరావుపేటకు వచ్చిన టీడీపీ నాయకులు బుద్దా వెంకన్న, కొల్లు రవీంద్ర, పత్తిపాటి పుల్లారావు, స్థానిక నాయకులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు తనతో పాటు వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డిలపై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. వారు ఎంతమంది వచ్చి చెప్పినా సంఘటనలో జరిగిన నిజాలు అబద్ధ కావన్నారు. జరిగిందేమిటో స్థానిక ప్రజలకు ఇప్పటికే తెలుసునన్నారు.

దాడిపై నిజనిర్ధారణ కమిటీ వేయండి

నిజంగా చంద్రబాబుకు ధైర్యం ఉంటే టీడీపీ కార్యాలయంలో రౌడీషీటర్ సుబ్బారావుపై అదే పార్టీ నాయకుడు దాడికి దిగటంపై నిజనిర్ధారణ కమిటీ వేసి ప్రజలకు వాస్తవాలేమిటో తెలియచేయాలని టీడీపీ నాయకులకు ఎమ్మెల్యే సవాల్ విసిరారు. తానిప్పటికే ఒక సవాల్ విసిరానని, తాను దాడిచేసినట్లుగా ఒక్క వీడియో చూపించమంటే టీడీపీ నాయకుల నుంచి స్పందన లేదన్నారు. బుద్దా వెంకన్న తన స్థాయిని మరిచి ఆరోపణలు చేస్తున్నాడన్నారు.

పొత్తులేనిదే పోటీచేయ లేనివారు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తామంటే వణుకు పుడుతుందని మాట్లాడుతున్నారని, సీఎం జగన్‌పై ఒక్కొకరుగా పోటీచేసేందుకు ధైర్యంలేక మూడు పార్టీలు కలిసి పోటీ చేయాలనుకుంటున్నారన్నారు. తాము ఒక్కరిగా 175 స్థానాలకు పోటీచేస్తామని చెప్పిన వ్యక్తి సీఎం జగన్ అన్నారు. పవన్ కల్యాణ్ లేకపోతే వారికి 175 మంది అభ్యర్థులు కూడా దొరకరన్నారు. గత ప్రభుత్వంలో తమపై 20కేసులు పెట్టారని, తనపై హాస్పిటల్‌పై దాడిచేశారని, తాము ఇక్కడే ఉంటామని, దేనికి భయపడే ప్రసక్తే లేదన్నారు. బీసీ నాయకులమని వచ్చి అరవింద బాబుకు మద్దతుగా మాట్లాడే టీడీపీ నాయకులు వచ్చే ఎన్నికల్లో అరవిందబాబే నరసరావుపేట అభ్యర్థని ప్రకటించాలని ఎమ్మెల్యే గోపిరెడ్డి సవాల్ విసిరారు.

ఎస్‌బీఎం మండల కోఆర్డినేటర్లుగా...



కోఆర్డినేటర్‌గా నియామకపత్రాన్ని అందుకుంటున్న అయ్యపరెడ్డి



నియామాక పత్రాన్ని అందుకుంటున్న సుబ్బారెడ్డి

నరసరావుపేట రూరల్: స్వచ్ఛభారత్ మిషన్ ఫేజ్-2 మండల రీసోర్స్ కోఆర్డినేటర్‌గా తుమ్మ అయ్యపరెడ్డి నియమితులయ్యారు. సాక్షరభారత్ మండల కోఆర్డినేటర్‌గా అయ్యపరెడ్డి 2010-18వరకు మండలంలో పనిచేశారు. గత టీడీపీ ప్రభుత్వం 2018లో సాక్షరభారత్ కోఆర్డినేటర్లను తొలగించింది. వీరిని స్వచ్ఛభారత్ మిషన్ మండల కో ఆర్డినేటర్లుగా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు శనివారం ఎంపీడీఓ వెంకటేశ్వరరావు నుంచి నియామకపత్రాన్ని అందుకుని ఎస్‌బీఎం మండల కోఆర్డినేటరుగా అయ్యపరెడ్డి బాధ్యతలు స్వీకరించారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల: స్వచ్ఛ భారత్ మండల రిసోర్స్ కో-ఆర్డినేటర్‌గా మేడికొండ సుబ్బారెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. తెలుగుదేశం ప్రభుత్వంలో సాక్షర భారత్ కో-ఆర్డినేటర్‌లుగా పనిచేసిన వారందరినీ తొలగించింది. చంద్రబాబునాయుడు 483 మంది సాక్షర భారత్ కో-ఆర్డినేటర్లను తొలగించటంతో వారందరూ జీవనోపాధి కోల్పోయారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేస్తున్న సమయంలో జీవనోపాధి కోల్పోయిన వీరందరు వారి సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తాము అధికారంలోకి వస్తే మీ అందరికీ ఉద్యోగ భద్రత కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఆయన హామీ మేరకు తమందరినీ తిరిగి మండల రిసోర్స్ కో-ఆర్డినేటర్‌లుగా నియమించారన్నారు. జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల అనుసరించి ఎంపీడీవో మాధ్యూబాబు, ఎంపీపీ గడ్డం వెంకట్రావులు ఎం. సుబ్బారెడ్డికి నియామక పత్రాన్ని అందజేశారు.

గొరిజవోలులో ఉచిత వైద్య శిబిరం

నాదెండ్ల: గొరిజవోలు గ్రామంలో మాజీ ఎంపీపీ కంజుల వీరారెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గుంటూరు సమీపంలోని చినకొండ్రుపాడు కాటూరి ఆసుపత్రి, మెడికల్ కళాశాల వైద్య బృందం శిబిరంలో వైద్య సేవలందించారు. 250 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. వీరిలో 50 మందిని మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి రిఫర్ చేశారు. జనరల్ మెడిసిన్, ఆర్థో, ఆప్తమాలజీ, ఈఎన్‌టీ, డెర్మటాలజీకి చెందిన వైద్యులు డాక్టర్ సందీప్, రవళి, శివాజి, అఖిల్, తనూజలు వైద్య పరీక్షలు చేశారు. మెడికల్ క్యాంపు నిర్వహణకు ఏర్పాట్లు చేసిన మాజీ ఎంపీపీ కంజుల వీరారెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ప్రతినిధులు బెల్లంకొండ వెంకటనరేంద్ర, క్రాంతి, నరేంద్ర, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



గొరిజవోలులో వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

నర్సరీలు నాణ్యమైన నారును ఇవ్వకుంటే చర్యలు

యడ్లపాడు: రైతులకు నర్సరీ యజమానులు నాణ్యమైన నారును అందించాలని.. లేకుంటే వారిపై శాఖా పరమైన చర్యలు తప్పవంటూ చిలకలూరిపేట ఉద్యాన అధికారి ఎన్.కిషోర్ హెచ్చరించారు. యడ్లపాడు మండలంలోని చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామంలోని నర్సరీను ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా హెచ్‌వో మాట్లాడుతూ నియోజకవర్గంలోని నర్సరీ యజమానులు తప్పనిసరిగా 2010 నర్సరీ చట్టం ప్రకారం లైసెన్సులను తీసుకోవాలన్నారు. అలాగే వారి రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. రైతులకు మిరప పరమైన నారును నాణ్యమైన వాటిని అందించాలని షేడ్‌నెట్ యజమానులకు ఆదేశించారు. అలాగే రైతులకు కూడా విత్తనాలు, నారు కొనుగోలు బిల్లుల్ని విధిగా తీసుకోవాలన్నారు. గ్రామ నర్సరీ నిర్వాహకులు, ఉద్యాన, వ్యవసాయ సహాయకులు బి.వినయ్‌కుమార్, ఝాన్సీ పాల్గొన్నారు.

హిందూ శ్మశాన వాటికకు మరమ్మతులు



శ్మశాన వాటికకు ట్రాక్టర్‌లతో మట్టి తోలుతున్న దృశ్యం

రొంపిచర్ల: స్థానిక బోసు బొమ్మ సెంటర్లో గల భట్రాజు కులస్తులకు చెందిన హిందూ శ్మశాన వాటిక స్థలానికి శనివారం మట్టితోలి లెవలింగ్ పనులు చేపట్టారు. శాసన సభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు శ్మశాన వాటికకు మట్టి పనులు చేపట్టినట్లు గ్రామ పెద్దలు తెలిపారు. శ్మశాన వాటికకు ట్రాక్టర్లతో మట్టి తోలించి చదును చేయటం జరిగింది. ఈ పనులను గ్రామ సర్పంచ్ కొమ్ము నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ పడాల చక్రారెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ పోతుమంచి అంజంరాజు, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సరికొండ తిమ్మరాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ లబ్ధి పొందేందుకే జగనన్న సురక్ష



వినుకొండ హనుమాన్ నగర్ రేషన్ కార్డు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు



కారుమంచిలో ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

చిలకలూరిపేట: అర్హులై ఉండి ఏ ఒక్కరూ లబ్ధి పొందకుండా మిగిలి పోకుడదన్న గొప్ప ఉద్దేశంతో నిర్వహిస్తున్న కార్యక్రమం జగనన్న సురక్ష అని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. పట్టణంలోని 18,25 వార్డులకు సంబంధించిన సచివాలయాల వద్ద జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంట్లో ఏ చిన్న సమస్య ఉన్నా పరిష్కరించాలన్న చిత్తశుద్ధితో ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నదని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ మంచి చేసిన ప్రభుత్వం, అర్హులై ఉండి ఏ కారణం చేతనైనా పొరపాటున ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే వారికి కూడా సంక్షేమ పథకాలు అందించాలని చిత్తశుద్ధితో ప్రభుత్వం కృషి చేస్తుందని వెల్లడించారు. జగనన్న సురక్ష ద్వారా ఇంటింటినీ జల్లెడ పట్టి మరీ లబ్ధి అందించేలా ప్రణాళిక రూపొందించటం జరిగిందన్నారు. నెలరోజుల పాటు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో జనన, మరణ, కుల, ఆదాయ, రేషన్‌కార్డు తదితర 11 రకాల సేవలను ఎలాంటి రుసుము లేకుండా ఉచితంగా ప్రభుత్వం అందజేస్తున్నదని చెప్పారు. కార్యక్రమంలో 18, 25 వార్డు కౌన్సిలర్లు షేక్ నాయబ్ సైదాబి, తోట నాగలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, డీఈఈ తోట వెంకట రమణ, ఆయా వార్డు ఇన్‌చార్జులు, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వినుకొండలో...

వినుకొండ(నూజెండ్ల): జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని హనుమాన్‌నగర్-1, 2 సచివాలయాల్లో శనివారం సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వెంకయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు అవసరమైన 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇటువంటి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగించుకోవా లన్నారు. అనంతరం లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు షకీలా, ఎంఎస్‌కే బాషా, బత్తుల పద్మ, ఎంఎల్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూజెండ్ల మండలంలో..

జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా నూజెండ్ల మండలంలోని చింతలచెర్వు, కంభంపాడు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు అవసరమైన 11 రకాల సర్టిఫికెట్లను, రైతులకు కంది విత్తనాలను అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, తలారి ఆంజనేయులు, తహసీల్దార్ మదుబాబు, ఎంపీడీవో వీరభద్రాచారి, ఏవో సుగుణాబేగం, అన్ని శాఖల మండలస్థాయి అధికారులు, గ్రామసచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పేదలకు వరం

శావల్యాపురం: జగనన్న సురక్ష కార్యక్రమం పేదలందరికీ వరమని ఈపూరు మార్కెట్ యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండలంలోని కారుమంచి గ్రామసచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమక్షంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఈపూరు యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అర్హత కలిగి నేటి వరకు సంక్షేమ పథకాలు పొందనటువంటి లబ్ధిదారులకు సువర్ణ అవకాశామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో పార్టీలకు కుల మతాలకు అతీతంగా సంక్షేమ పథ కాలు పారదర్శకంగా అందుతున్నాయన్నారు. 1650 వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేసి కారుమంచి గ్రామసచివాల యం జిల్లాస్థాయిలో ప్రథమస్థానం రావటం మంచి శుభపరిణామమన్నారు. అనంతరం వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లావరపు విశ్రాంతం, ఎంపీటీసీ సభ్యులు బాబురావు, ఎంపీడీవో పేరు మీనా సీతారామయ్య, తహసీల్దారు షేక్ జాన్‌సైదులు, వైఎస్సార్ సీపీ నాయకులు వుట్ల సుబ్బారావు, కావూరి మాబు సుభానయ్య, పంచాయతీ కార్యదర్శి చింతా శ్రీనివాసరావు, వీఆర్వో దూపాటి దేవమ్మ, వలంటీర్లు పాల్గొన్నారు.

అర్హులకు ఓటు హక్కు కల్పిస్తాం

శావల్యాపురం: ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు 2024 జనవరి నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తామని తహసీల్దారు షేక్ జాన్‌సైదులు వెల్లడించారు. ఓటర్ల సర్వే కార్యక్రమం వచ్చే నెల 21 వరకు ఇంటింటికీ బూత్ లెవల్ అధికారుల చేపడతారన్నారు.

ఆటో డ్రైవర్లు.. నిబంధనలు అతిక్రమించొద్దు



ఆటో డ్రైవర్‌లకు ట్రాఫిక్ రూల్స్ వివరిస్తున్న సీఐ రాంబాబు

నరసరావుపేట టౌన్: నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ ఎం. రాంబాబు డ్రైవర్‌లను హెచ్చరించారు. శనివారం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్‌లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటో డ్రైవర్‌లు నిబంధనలు పాటించక పోవటంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందన్నారు. డ్రైవర్‌లు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే వాహనాలు నిలిపి ప్రయాణికులను ఎక్కించుకోవాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే చర్యలు తప్పవన్నారు.